క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విశేషాభిషేకాలు, పూజలు, పల్లకీసేవ నిర్వహించారు.

చంద్రప్రభ వాహనంపై భగవద్రామానుజులు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న భగవద్రామానుజాచార్యులు అవతార మహోత్సవాల్లో భాగంగా చంద్రప్రభ వాహనంపై స్వామి వారు శనివారం ఊరేగారు. తిరుమంజనం, సేవా కాలం, శాత్తుమొరైను నిర్వహించారు.

నేత్రపర్వంగా పుష్పయాగం



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విశేష పూజలను శనివారం నిర్వహించారు. 108 కలశాల్లో వివిధ రకాల ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. సీతారామ, లక్ష్మణ, సువర్చల, ఆంజనేయస్వామికి పుష్పయాగాన్ని నేత్రపర్వంగా జరిపారు. ఉభయకర్తలుగా సుబ్బారావు, రామచంద్రరావు, బలరామ్, సురేష్, అరవింద దంపతులు వ్యవహరించారు. నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, ఆర్యవైశ్య సంఘ నేత గోపాల్, ఈఓ హేమచంద్ర రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన క్రీడాభిమానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చిన్నతనంలో క్రికెట్ ఆడిన అందరూ 40 ఏళ్ల తర్వాత మరోసారి ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడి తమ క్రీడాభిమానాన్ని చాటుకున్నారు. అమెరికా, మలేసియా, సింగపూర్, కెనడా, నెల్లూరులో ఉన్న క్రీడాకారులు బుజబుజనెల్లూరులోని సీపీఏ క్రికెట్ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో తలపడ్డారు. నెల్లూరులో తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకొని ఉత్సాహంగా గడిపారు.

ఘనంగా పరశురామ జయంతి

నెల్లూరు(బృందావనం): సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిరంలో పరశురామ జయంతిని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. వైశాఖ శుద్ధ తదియ, అక్షయ తృతీయను పురస్కరించుకొని మందిరంలో కొలువైన కృష్ణుడు పరశురామ అలంకారంలో దర్శనమిచ్చారు. మందిర నిర్వాహకుడు సర్వేపల్లి అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యలక్ష్మిగా మహాలక్ష్మి



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని మహాలక్ష్మి దేవస్థానంలో వార్షిక వసంత పరిమళ కొఠాయి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో శనివారం ప్రారంభించారు. అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా రాజా నరసింహారావు కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకుడు సుబ్బరామశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీరామ్ వెంకటసురేష్, రవి, నరేంద్రప్రసాద్, బాలాజీ, ఈఓ హేమచంద్రరావు పర్యవేక్షించారు.

దాడిపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని మినగల్లుకు చెందిన అల్లం శ్రీనివాసులు తనపై గ్రామానికి చెందిన జయసూర్య దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రతాప్ తెలిపిన వివరాల మేరకు..అల్లం శ్రీనివాసులు తన పొలంలో నుంచి వస్తుండగా జయసూర్య ట్రాక్టర్‌తో అడ్డుతగిలి ఉద్దేశపూర్వకంగా దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



పొదలకూరు:ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బుచ్చిరెడ్డిపాళెం: రంజాన్ సందేశాన్ని వినిపిస్తున్న మతపెద్ద

భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫిత్ర్

పొదలకూరు : ఈద్-ఉల్-ఫిత్ర్‌ను మండలంలోని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పొదలకూరు సమీపంలోని ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జామా మసీదు మౌలానా ఖాజీముస్తాక్‌మాదనీ ఈద్-ఉల్-ఫిత్ర్ సందేశాన్ని అందజేశారు. సేవాభావం కలిగి ఉండడమే భగవత్ సందేశంగా పేర్కొన్నారు. ఏ మత గ్రంథాలైనా పేదలను ఆదరించాలని చెబుతాయన్నారు. దైవానుగ్రహానికి ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని ఎంచుకోవడం జరుగుతుందన్నారు. రంజాన్ మాసంలో ఈద్-ఉల్-ఫిత్ర్ పవిత్రమైన దినంగా పేర్కొన్నారు. త్యాగానికి సేవానిరతికి ప్రతీకగా నిలిచే రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం పేదలకు సాయం చేయాలన్నారు. సొంత మతాన్ని ఆదరించడంతో పాటు ఇతర మతాలను గౌరవించాలన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో ఎస్సై ఎస్‌కే కరిముల్లా, జిల్లా వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఎస్‌కే ఖాదర్, మైనార్టీ నాయకుడు ఎస్‌కే అంజాద్, మతపెద్దలు పాల్గొన్నారు.

ముత్తుకూరు: ఈద్-ఉల్-ఫిత్ర్‌ను మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముత్తుకూరు, ఈపూరు, సుబ్బారెడ్డిపాళెం, పల్లెపాడుదిబ్బ, బ్రహ్మదేవి, మామిడిపూడి, పొట్టెంపాడు, ముసునూరువారిపాళెం, తాళ్లపూడి, తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఈద్-ఉల్-ఫిత్ర్ సందేశాన్ని వినిపించారు.



వెంకటాచలంలో...

వెంకటాచలం: ఈద్-ఉల్-ఫిత్ర్‌ను మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వెంకటాచలం, కసుమూరు, సర్వేపల్లి, గొలగమూడి, అనికేపల్లి, ఇస్లాంపేట, కంటేపల్లి గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింసోదరులు ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

మనుబోలు: ఈద్-ఉల్-ఫిత్ర్‌ను మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మనుబోలులోని ప్రధాన రహదారి పక్కనున్న ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. బీసీ కాలనీలోని ఉస్మానియా మస్జిద్, మడమనూరు, కాగితాలపూరు, బద్దెవోలు, కొలనకుదురు గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మనుబోలులో మతపెద్ద మునీర్ ఈద్- ఉల్-ఫిత్ర్ సందేశాన్ని వినిపించారు.

బుచ్చిరెడ్డిపాళెం: ఈద్-ఉల్-ఫిత్ర్‌ను మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా దాదాపు ముప్పైరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు వాటిని విరమించి ఈద్‌ను సంతోషంగా జరుపుకొన్నారు. ఖాజానగర్‌లోని మస్జిదే అల్ అమిన్ వద్ద ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్ద ప్రభోదించిన ఈద్ సందేశాన్ని విని ఒకరికొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఇస్కపాళెం, రెడ్డిపాళెం, జొన్నవాడ, రేబాల, దామరమడుగు, తదితర గ్రామాల్లోని మస్జీద్‌ల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కొడవలూరు: రంజాన్ పర్వదినాన్ని మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.నార్తురాజుపాళెం, కొడవలూరు, యల్లాయపాళెం, గండవరంలోని ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం పేదలకు దానాలు చేశారు. ఈ కార్యక్రమంలో షాభీర్, షకీల్, సోహైల్, అఫ్రోజ్‌లు పాల్గొన్నారు.



ముత్తుకూరులో..



మనుబోలులో..

మజ్జిగ పంపిణీ



మనుబోలు: సేవానాథం ట్రస్ట్ ఆధ్వర్యంలో మనుబోలులోని వైఎస్సార్ సర్కిల్ వద్ద శనివారం మజ్జిగను పంపిణీ చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సూచనలతో వారానికోరోజు మనుబోలులోని రద్దీ కూడళ్లలో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవానాథం ట్రస్ట్ సభ్యులు మహీధర్‌రెడ్డి, భార్గవ్, గిరి, లోకేష్ దివ్యతేజ, శ్రీకాంత్, రామచంద్ర, సుధాకర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను మానుకోవాలి



కొడవలూరు: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను మానుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ అన్నారు. మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ప్రచార భేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని మోదీ ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ పరమైన ఆస్తులను ప్రైవేట్ పరం చేసి కార్పొరేట్ సంస్థలకు మేలు చేస్తోందని విమర్శించారు. దీని వల్ల కార్మికులు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. మోదీ గద్దెనెక్కిన నాటి నుంచి నిత్యావసర ధరలకు రెక్కలు వచ్చాయని ఆరోపించారు. ఇప్పటికైన ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకోవాలని, లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సీపీఎం మండల కార్యదర్శి వల్లపూడి నరసయ్య, నాయకులు భూలోకం కాంతారావు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం భాస్కర్‌చక్రవర్తి

పొదలకూరు : బీమా పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పొదలకూరు కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ ఎం భాస్కర్‌చక్రవర్తి కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కెనరా బ్యాంకు ఖాతాదారుల అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన పథకాలపై అవగాహన కల్పించారు. జీవన్‌జ్యోతి పథకానికి 18 నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఈ పథకం కింద ఏడాదికి రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షల బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. సురక్ష బీమా పథకానికి 18 నుంచి 70 ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. ఈ పథకం కింద రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ నెల 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. బ్యాంకు ఖాతాదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ ప్రదీప్‌కుమార్, బ్యాంకు మేనేజర్ నాగనాథ్, నెల్లూరు రీజియన్ కార్యాలయ సిబ్బంది, పొదలకూరు బ్రాంచి సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పేడూరు గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం మంత్రి కాకాణి నిర్వహించారు. తొలుత రూ.29.30 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ సత్వర పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా గడప గడపకు సంక్షేమ ఫలాలను చేరవేస్తుండడంతో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఇప్పటి వరకు సర్వేపల్లి నియోజకవర్గంలోని 75 సచివాలయాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేశామని తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. పేడూరు సచివాలయం పరిధిలో రూ.1.82 కోట్లతో సీసీరోడ్లు, రూ.30లక్షలతో సైడ్ డ్రెయిన్స్ నిర్మాణాలతో పాటు మొత్తం రూ.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. ప్రజల ఆదరణ కోల్పోయిన ప్రతిపక్ష టీడీపీ నేతలు తమ మైలేజ్‌ను పెంచుకునేందుకు అధికార పార్టీని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోదపా ఆదరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, నాయకులు తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, లేబూరు మల్లికార్జున్, ఎంపీటీసీ సభ్యులు వసంతీ, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

ముత్తుకూరు: ఎస్సై శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను శనివారం నిర్వహించారు. రిలయన్స్ రోడ్డులో ద్విచక్ర వాహన చోదకులను బ్రీత్ ఎనలైజర్ ద్వారా తనిఖీలు చేశారు. మద్యం సేవించిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. విలువైన ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

తోటపల్లిగూడూరు: కోడూరులోని బాలికల గురుకులంలో ఐదోతరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్షలను ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ శనివారం తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతికి 152 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 213 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 5వ తరగతి ప్రవేశానికి ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని వివరించారు. విద్యార్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ముత్తుకూరు: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఆదాని కృష్ణపట్నంపోర్టు ఈహెచ్‌ఎస్ డిపార్ట్‌మెంట్ హెడ్ వేణుగోపాలరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం సందర్భంగా పోర్టులో ఉద్యోగులు, కార్మికులు శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్గారాలను అదుపు చేసేందుకు హరిత వనాలు పెంచడమే ఏకైక మార్గమన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని కోరారు. పోర్టు పర్యావరణ అధికారులు రాంబాబు, మధుసూదన్, కంటైనర్ టెర్మినల్ హెడ్ వీరేంద్రబెల్వాల్, హార్టీకల్చర్ ఇన్‌చార్జి సలీల్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈహెచ్‌ఎస్ హెడ్ వేణుగోపాలరెడ్డి

వైభవంగా మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం

ఇందుకూరుపేట: మండలంలోని రావూరుకండ్రిగలో జరుగుతున్న మహాలక్ష్మమ్మ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గ్రామోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. మహాలక్ష్మమ్మను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శుక్రవారం రాత్రి ప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.



మారంరెడ్డి మృతికి నివాళి

తోటపల్లిగూడూరు: తోటపల్లిగూడూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ రాజకీయ నాయకుడు మారంరెడ్డి గోపాలరెడ్డి(75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఇస్కపాళెంలోని స్వగృహంలో ఉంచిన మారంరెడ్డి భౌతికకాయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఉదయం సందర్శించి నివాళులర్పించారు. మారంరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని ఇచ్చారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేతలు ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఆల్తూరి మహేష్‌రెడ్డి ఉన్నారు.



కొత్తూరులో చోరీ

ఇందుకూరుపేట: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి నగదు, బంగారు అపహరించుకెళ్లారు. ఈ ఘటన కొత్తూరులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కొత్తూరుకు చెందిన నెట్రంబాకం నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి వేరే గ్రామంలోని గుడికి వెళ్లాడు. శనివారం వేకువ జామున ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉంది. అందులో రూ.50 వేల నగదు, నాలుగున్నర సవర్ల బంగారం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకట రాజేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.



పార్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. అమ్మవారు పార్వతీదేవిగా శనివారం దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.